పత్రిక ప్రకటన కాకినాడ, అక్టోబరు 10, 2019

రాష్ట్రంలో రెవెన్యూ శాఖ ప్రక్షాళన.

రెండు నెలల్లో ల్యాండ్ సీలింగ్ భూముల సమస్యలు పరిష్కరించాలి.

భూ రికార్డులు స్వఛ్ఛతీకరణ .

--- ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్.

రాష్ట్రంలో భూ రికార్డులు స్వఛ్ఛతీకరణలో భాగంగా రెవెన్యూ శాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖా మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ తెలిపారు. గురువారంనాడు కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో నవరత్నాలు-పేదలకు ఇళ్ళు అనే అంశం పై రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కురసాల కన్నబాబు , గృహనిర్మాణ శాఖామంత్రి చెరుకువాడ శ్రీ రంగనాధరాజు తో కలిసి వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో భూమి రికార్డుల నిర్వహణ సక్రమంగా వుండాలన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు గురుతరమైన బాధ్యత నిర్వహింవలసివుంటుందన్నారు. రాష్ట్రంలో 1983వ సంవత్సరం అనంతరం రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదన్నారు. రాష్ట్రంలో 2.60 లక్షల ఎకరాలు ఆర్ అండ్ ఆర్‌కు అడంగళ్ కు మధ్య వ్యత్యాసం ఉందన్నారు. అదే విధంగా 1.25 లక్షల ఎకరాల్లో అడంగళ్‌లు నమోదు కాలేదన్నారు. ఇటువంటి వ్యత్యాసాలను తొలగించడానికి భూమి రికార్డులను స్వఛ్ఛతీకరణ చేయవలసివుందన్నారు. రెవెన్యూ రికార్డులు సక్రమంగా వుంటే ఈ వ్యవస్థ సరిగా పని చేస్తుందని, దీని ద్వారా ధనం కూడా ఆదా అవుతుందని మంత్రి అన్నారు. జిల్లాలోని రెవెన్యూ రికార్డులు ఒక సంవత్సరం పాటు కష్టపడి పని చేసి సరిచేయాలన్నారు. దీని కోసం జమాబందీ నిర్వహణ మరియు ఆడిట్ అవసరం వుందన్నారు. ఈ చర్యల్లో భాగంగా నిపుణులు, తహశిల్దార్లు, ఆర్‌డిఓలు మరియు గతంలో పని చేసిన గ్రామ స్థాయి రెవెన్యూ అధికారులు సలహాలను కూడా తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని ఇళ్ళ స్థలాల పంపిణీకి అవసరమైన భూమిని మరియు భూమి రికార్డులను స్వఛ్ఛతీకరణ పై రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇంటీరియం రిపోర్ట్ సమర్పిస్తామన్నారు.

రాష్ట్రంలో భూ రికార్డుల స్వఛ్ఛతీకరణను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని, ఈ మేరకు ఇటీవల నియమించబడ్డ గ్రామ సర్వేయర్ల సేవలను కూడా వినియోగించాలన్నారు. ఈ సర్వే కోసం 3 గ్రామాలను యూనిట్ గా తీసుకొని సర్వేయర్ల సేవలను వినియోగించాలన్నారు. రాష్ట్రంలో చేపట్టబోయే భూమి రికార్డుల స్వఛ్ఛతీకరణకు త్వరలో దిశా నిర్దేశం చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

**సీలింగ్ భూముల సమస్యలు రెండు నెలల్లో పరిష్కరించాలి- ఉపముఖ్యమంత్రి**

రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న సీలింగ్ భూముల సమస్యలను వచ్చే రెండు నెలల్లో పరిష్కరించాలని ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆదేశించారు. రాష్ట్రంలో

భూదానోద్యమం సందర్భంగా పేదలకు చెందవలసిన భూములు ఇంకా భూస్వాముల చేతులలో ఉండడం బాధాకరమన్నారు. అదే విధంగా ఈ సీలింగ్ భూములను సర్వే చేసి మరలా భూ స్వాములకు లీజుకు ఇచ్చిన సంఘటనలు కూడా వున్నాయన్నారు. ఇటువంటి భూములు ప్రభుత్వం ఆధీనంలోగానీ, పేద ప్రజలకు ఇవ్వడంగానీ జరగాలన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అవసరమైతే ఉన్నత న్యాయ స్థానంలో కూడా సంప్రదిస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 11,158 సర్వే పోస్టుల నియామకం చేయడం జరిగిందన్నారు. భూ రికార్డులు రీసర్వే కోసం పైలెట్ ప్రోజెక్ట్ గా జగ్గయ్యపేట మండలం ఎంపిక చేయడం జరిగిందన్నారు. దీనిని కోర్స్ టెక్నాలజీతో సర్వే నిర్వహించనున్నామన్నారు. దీని కోసం టెండర్లు ప్రక్రియ జరుగుతుందని మంత్రి బోస్ తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలి- మంత్రి కన్నబాబు

సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ,సహకార శాఖామంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ ప్రభుత్వం మరియు దేవాదాయ భూముల పరిరక్షణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలన్నారు . కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ, దేవాదాయ భూములు అన్యక్రాంచమవుతున్నాయని, వీటిని పరిష్కరించి, వీటిని పరిష్కరించవలసిన ఆవస్యకత ఉందన్నారు. రెవెన్యూ రికార్డులు తప్పులకు ఆస్కారం లేకుండా ఖచ్చితంగా ఉండే విధంగా రెవెన్యూ అధికారులు పని చేయాలన్నారు. దీనిని ఒక సామాజిక బాధ్యతగా చేపట్టాలన్నారు. ప్రభుత్వ పరిపాలన సజావుగా జరుగుతుందని అధికారులపై ఏవిధమైన ఒత్తిడి లేకుండా పారదర్శకంగా పనిచేసే విధంగా ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. రెవెన్యూ శాఖలోని విఆర్వోలకు భూరికార్డులపై ప్రత్యేక శిక్షణ ఇవ్వవలసి ఉందన్నారు. దేవదాయ, ఎపిఐఐసి భూముల్లో గృహనిర్మాణాలు చేసుకున్న వారికి భూమికి భూమి ఇచ్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలన్నారు. తీర ప్రాంతాల్లో మత్స్యకారులు నిర్మించుకున్న గృహాలు పాడైనందున వాటికి మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లేఅవుట్స్‌లో ఓపెన్ ప్రాంతంలో నిర్మించిన గృహాలను మరియు పనిచేయని ట్యాంకుల్లో నిర్మించిన గృహాలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు అవసరమని మంత్రి సూచించారు. గతంలో గృహ నిర్మాణ లబ్ధిదారుల ప్రమేయం లేకుండానే మరుగుదొడ్లు మంజూరు చేసి ఆ నిధులు లబ్ధిదారులకు చేరలేదని అలాంటి వారి సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు. కొన్ని సందర్భాల్లో ఆధార్ నెంబరు, భూ యజమానికి అనుసంధానం కావడం లేదని ఇటువంటి సమస్యలపై రెవెన్యూ , వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి కన్నబాబు పలు సూచనలు చేశారు.

గృహ నిర్మాణ శాఖామాత్యులు చెరుకువాడ శ్రీరంగనాధ్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 67 వేల గృహాలకు 176 కోట్ల రూపాయలు మేర బకాయిలు చెల్లించవలసివుందని వీటిలో 81 శాతం గృహాలను పరిశీలించడం జరిగిందన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు నేరుగా సొమ్ము చెల్లించడానికి యాప్‌ని కూడా రూపొందించడం జరిగిందన్నారు. ఇండ్ల స్థలాల పంపిణీ కోసం భూ సేకరణలలో భూ

యజమానులతో సంప్రదించి సజావుగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. కోస్తా ప్రాంతంలో మత్స్యకారుల గృహ నిర్మాణాల పరిరక్షణకు ఒక నివేదికను రూపొందించి ముఖ్యమంత్రికి సమర్పించనున్నట్లు మంత్రి రంగనాథ్‌రాజు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో పాల్గొన్న గృహ నిర్మాణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే ఉగాదికి లబ్ధిదారులకు అందజేసే 25 లక్షల ఇళ్ల స్థలాలు పొందిన వారికి రాబోయే నాలుగు సంవత్సరాల్లో గృహ నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

కలక్టరు డి.మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 2 లక్షల 61 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. లబ్ధిదారుల ఎంపికకు ప్రతీ మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్ , మూడు మండలాలకు ఒక సూపర్‌వైజర్ ఆఫీసర్‌ను నియమించడం జరిగిందన్నారు. ఈ నెల 15వ తేదీ నాటికి లబ్ధిదారుల జాబితాను ప్రచురించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ నిధుల కింద ఇంటర్నల్ రోడ్లు, డ్రైన్‌లకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. అదే విధంగా ప్రభుత్వం వివిధ సంస్థలకు ఇచ్చిన భూములను కూడా తీసుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని కలక్టరు తెలిపారు.

జాయింటు కలక్టరు - 2 జి.రాజకుమారి మాట్లాడుతూ నవంబరు 1వ తేదీ నుండి ఇళ్ల స్థలాలకు అవసరమైన భూసేకరణకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 1641 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. జిల్లాలో ఇళ్ల స్థలాల కోసం 5 లక్షల దరఖాస్తులు వస్తే వీటిని పరిశీలించగా 2 లక్షల 19 వేల 600 లుగా తెలాయన్నారు. ఇందులో 1 లక్ష 44 వేల మంది గ్రామీణ ప్రాంతాలలోను, 75 వేల 715 మంది అర్బన్ ప్రాంతాలలో వున్నారన్నారు. వీటికి గానూ 3358 ఎకరాలు భూసేకరణ చేయాలని జేసీ - 2 తెలిపారు.

ఈ సమావేశంలో ఇళ్ల స్థలాల పంపిణీపై డివిజన్ల వారీగా ఉపముఖ్యమంత్రి ఆర్డీవోలతో నేరుగా సమీక్షించారు. ఈ సందర్భంగా పంట సాగు పత్రాలను కౌలు రైతులకు అందించారు.

ఈ సమావేశంలో అనపర్తి, రామచంద్రపురం, రంపచోడవరం శాసనసభ్యులు సత్తి సూర్యనారాయణరెడ్డి, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, నాగులపల్లి ధనలక్ష్మి, ల్యాండ్ రెవెన్యూ కమీషనర్ హరినారాయణ, జిల్లాలోని మున్సిపల్ కమీషనర్‌లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు, గృహనిర్మాణ శాఖ అధికారులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

(సమాచార శాఖ చే జారీ)